


వంటచెయ్యడం ముగించి తన గుడిసె ముందు దిగులుగా కుర్చుంది లక్ష్మి.

"ఏంటి లక్ష్మి అలా దిగులుగా కూర్చున్నావు?" అడిగింది పక్క గుడిసెలోని వెంకమ్మ.

"చంటోడిని తీసుకొని నా మావ పట్నంలోని పెద్దాసుపత్రికెళ్లాడు. ఉదయం అనగా వెళ్లిన మనిషి ఇంతవరకూ రాలేదు. చంటోడికి ఎలా వుందా అని భయంగా వుంది."

"ఏమయ్యింది మీ బాబుకి?"

"పక్షం రోజులుగా జ్వరం. ఏమి తిన్నా వాంతయిపోతోంది."

# నాన్నా నన్ను బ్రతికించవేవా?

మెండెపు ప్రసాద్

"చంటోడికి ఏమీ కాదులే కంగారుపడకు. పెద్దాసుపత్రిలో పనంటే తొందరగా అవుతుందా? చాలామంది రోగులుంటారు." లక్ష్మికి ధైర్యం చెప్పి తన గుడిసెలోకి వెళ్లిపోయింది వెంకమ్మ.

లక్ష్మి మాత్రం అలా ఎదురు చూస్తూనే వుంది. అలా ఎదురు చూడడంలో ఎంత సమయం గడిచిందో కూడా ఆమె గమనించలేదు. వీధిలో తన గుడిసెని దాటి వెళ్తున్న ఒక పెద్దాయనని టైమెంతయ్యిందని అడిగింది. సాయంత్రం ఆరు గంటలయ్యిందని చెప్పాడాయన.

"అప్పుడే ఆరయ్యిందా?!" అనుకుంటూ లేచి తన గుడిసెలోకి వెళ్లబోయింది. అంతలో వీధిచివర చంటోడిని భుజాన వేసుకొని నడిచొస్తున్న తన మావ కనపడ్డాడు. ఆనందంగా పరుగెత్తి ఎదురెళ్లి తన మావ భుజం మీది నుంచి నాలుగేళ్ల చంటోడిని తీసుకొని తన భుజాన వేసుకొంది.

"ఇంత ఆలస్యమయ్యిందేంటి మావా?" అని అడిగింది.

"ఏదో ఎక్సిడెంట్ కేసు వచ్చింది. డాక్టర్లందరూ ఆ కేసుతో బిజీగా వున్నారు, అందుకే ఆలస్యమయ్యింది."

గుడిసెలోకి వెళ్లాక చంటోడిని మంచం మీద పడుకోబెట్టి

"కాళ్లు కడుక్కురా మావా అన్నం వడ్డిస్తాను." అంది.

"వద్దే. తినాలని లేదు." నిర్లిప్తంగా చెప్పాడు.

"ఏంటి మావా చంటోడికి ఏమవుతుందోనని భయమా? పెద్ద డాక్టరు మందులిచ్చాడుగా తగ్గిపోతుందిలే." అనునయంగా అంది.

లక్ష్మి భుజం మీద చెయ్యి వేసి "మన చంటోడిని రెండు మూడు రోజులలో తీసుకొచ్చి ఆసుపత్రిలో చేర్పించమన్నారు." నెమ్మదిగా చెప్పాడు.

"ఎందుకు? మన చంటోడికేమయ్యింది?" కంగారుగా, భయంగా అడిగింది.

"మన చంటోడికి అదేదో కొత్తరకం కామెర్లట. జబ్బు బాగా ముదిరిపోయిందట. ప్రభుత్వాసుపత్రిలో ఈ జబ్బుకి సరైన వైద్యంగాని మందులు గాని దొరకవట. ఆ డాక్టరుగారికి వేరే

ప్రయివేటు ఆసుపత్రి వుందట. రెండుమూడు రోజులలో చంటోడిని దానిలో చేర్పించమన్నారు. రెండుమూడు రోజులలో ఆసుపత్రిలో చేర్పించపోతే కష్టం అన్నారు.'' బాధని దిగమింగుకోడానికి చేసిన ప్రయత్నం ఫలించక అతని గొంతు సన్నగా వణికింది.

తన మావ గొంతు అలా వణకడానికి గల కారణం పసిగట్టిన లక్ష్మి ''ఎంత డబ్బు కావాలన్నారు?'' అని అడిగింది.

''పదిహేను వేలు అవుతుందట. ఇంకో అయిదు వేలు ఎక్కువ తెచ్చుకోమన్నారు. అసలే గత మూడు సంవత్సరాలుగా వర్షాలు రాక, పంటలు పండక కరవుతో అల్లాడిపోతున్నాము. అంత డబ్బు ఎలా సమకూర్చాలా అని ఆలోచిస్తున్నాను.''

అతని మాటలలో డబ్బు సమకూర్చలేక కొడుకుని బ్రతికించుకోలేక పోతానేమో నన్న భయం వుందని గ్రహించిన లక్ష్మి అతని భుజం మీద చెయ్యి వేసి ''కంగారుపడకు మావా. ఎవరినైనా అప్పు అడుగు.'' అని సలహా యిచ్చింది.

''ఇప్పటికే వ్యవసాయం కోసం ఆ చమన్‌లాల్ దగ్గర డెబ్భై అయిదువేలు అప్పు చేసాను. వడ్డీతో కలిసి ఈపాటికా అప్పు లక్షరూపాయిలు అయి వుంటుంది. ఆ అప్పు తీర్చకుండా మరో ఇరవైవేలు అప్పివ్వమంటే ఆ చమన్‌లాల్ యివ్వడు.''

''వేరే ఎవరినైనా చూడు.''

''సరే ప్రయత్నిస్తాను'' అని బయల్దేరబోయాడు.

అతని చెయ్యిపట్టుకుని ''ఉదయం నుంచీ ఏమీ తినలేదు. కొంచెం అన్నం తిని వెళ్లు మావా'' అంది.

''వద్దే తినాలనిపించడం లేదు.'' అని చెప్పి బయటకి వెళ్లిపోయాడు.

***

''ఏంటి రామయ్యా యిలా వచ్చావు?'' అడిగాడు వడ్డీ వ్యాపారం చేసే శ్రీనివాసరావు.

''పదిహేనువేలు అప్పుకావాలి.'' యిస్తాడో యివ్వడోనన్న అనుమానంతో భయంగా అడిగాడు.

''క్యాష్ రెడీగా లేదు.''

ఆ సమాధానం చెప్పిన తీరుని బట్టి, ఆ కారణం నిజం కాదని అర్థమయ్యింది రామయ్యకి. దానితో ''పొలం పట్టా తాకట్టు పెట్టుకొని యివ్వండి.'' అని బ్రతిమాలాడు.

''రైతులెవ్వరికీ కొత్తగా అప్పులివ్వడం లేదు'' అసలు కారణం చెప్పాడు.

''ఎందుకు?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఈ మధ్య ప్రభుత్వం రైతులు ప్రయివేటు వ్యక్తుల వద్దనుంచి తీసుకొన్న అప్పుల మీద మారిటోరియం విధించింది. అంతేకాకుండా ఆత్మహత్యలు చేసుకున్న రైతుల విషయంలో ఏదో పేకేజి పెట్టారు. మేము అంతకంటే ఎక్కువ అప్పిచ్చి వున్నా గాని వసూలు చేసుకొనే అధికారం మాకు లేకుండా చేసారు. అలాంటప్పుడు మీ పొలాలు తాకట్టుపెట్టుకొని మాకు వుపయోగమేమిటి?''

''నా గురించి మన వూరిలో అందరికీ తెలుసు. నమ్మకంగా అప్పు తీర్చేస్తాను.'' తన నిజాయితీపై నమ్మకం కలిగేలా వివరించడానికి ప్రయత్నించాడు.

''నీ నిజాయితీ మీద నాకు పూర్తి నమ్మకం వుంది. కాని మా వడ్డీ వ్యాపారుల అసోసియేషన్‌లో మళ్లీ నిర్ణయం మార్చేవరకూ రైతులకి అప్పివ్వకూడదని నిర్ణయించారు.

''మా బాబుకి కామెర్ల జబ్బు బాగా ముదిరిపోయింది. పెద్దాసుపత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తే గాని బాబు బ్రతకడని డాక్టర్లు చెప్పారు. దయచేసి అప్పిచ్చి మా బాబు ప్రాణాలు కాపాడండి.'' కళ్లనీళ్లు పెట్టుకొని బ్రతిమాలాడు.

''మా అసోసియేషన్ నిర్ణయాన్ని వ్యతిరేకించి నేను నీకు అప్పివ్వలేను.''

నిరాశగా అక్కడి నుంచి బయల్దేరాడు రామయ్య. మరో ముగ్గురు వడ్డీవ్యాపారుల దగ్గర అప్పుకోసం ప్రయత్నించాడు. కాని వాళ్లు కూడా రైతులకి అప్పివ్వమని చెప్పారు.

కాళ్లీడ్చుకుంటూ నీరసంగా యింట్లోకి వచ్చిన భర్తని చూస్తూనే అప్పు ఎక్కడా దొరికి వుండదని లక్ష్మికి అర్థమయ్యింది. కాని మనసులో ఏదో మూల అప్పు దొరికి వుంటుందన్న చిన్న ఆశ. అందువలన ''అప్పు దొరికిందా మావా?'' అని అడిగింది.

''దొరకలేదు.'' అని జరిగినదంతా వివరించాడు.

''రేపు మళ్లీ ప్రయత్నిద్దూగానిలే. కాళ్లు కడుక్కురా. భోజనం చేద్దూగాని'' అని పళ్లెంలో అన్నం కూర వడ్డించింది.

అన్నం పళ్లెం ముందు కుర్చొని రెండంటే రెండే ముద్దలు తిని మిగిలిన అన్నం వదిలి లేచిపోయాడు.

''ఏంటి మావా అన్నం తినకుండా లేచిపోయావు?'' బాధగా అడిగింది లక్ష్మి.

''ఎంత ప్రయత్నించినా చంటోడి వైద్యానికి కావలసిన డబ్బులు తేలేకపోయాను. చంటోడు నాన్నా నన్ను బ్రతికించలేవా అని అడుగుతున్నట్లనిపిస్తోంది.'' చెప్పి తన కళ్ల నుంచి కారబోతున్న కన్నీటిని ఆపడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. కళ్లనుంచి బుగ్గల మీదగా జారిన కన్నీటి చుక్కలు ఎదురుగా నిలుచున్న లక్ష్మి పాదాల మీద పడ్డాయి.

పేదవాడికి అత్యంత దారుణమైన పరిస్థితి. చేతిలో డబ్బులు లేనప్పుడు కుటుంబంలో ఎవరికైనా ఖరీదైన జబ్బు చేయడమే.

చాలా జబ్బులకి సరైన వైద్యం కనిపెట్టబడని పాతరోజులలో రోగిని డాక్టరుకి చూపించి, మందులు వాడినా చివరికి రోగి చనిపోతే, మన ప్రయత్నం మనం చేసామని తృప్తి చెందేవారు రోగి కుటుంబసభ్యులు.

ఇప్పుడు చాలా జబ్బులని తగ్గించగలిగే ఆధునిక వైద్యం వుంది. కాని పేదవాడికి ఆ వైద్యం అందుబాటులో లేదు. తమ కుటుంబసభ్యులకొచ్చిన జబ్బుకి వైద్యం వుంది కాని అది తమ స్తోమతకి అందుబాటులో లేదని తెలిసి, వైద్యం చేయించలేక తమ ఆత్మీయులు చనిపోవడం నిస్సహాయంగా చూడటం కంటే నరకం ఎవరికైనా యింకేముంటుంది.

పేదవాడికి ఆ వైద్యం అందుబాటులో లేదు. తమ కుటుంబసభ్యులకొచ్చిన జబ్బుకి వైద్యం వుంది కాని అది తమ స్తోమతకి అందుబాటులో లేదని తెలిసి, వైద్యం చేయించలేక తమ ఆత్మీయులు చనిపోవడం నిస్సహాయంగా చూడటం కంటే నరకం ఎవరికైనా యింకేముంటుంది.

ప్రస్తుతం రామయ్య పరిస్థితి కూడా అలాగే వుంది.

తన భర్త కళ్లనుంచి కన్నీరు కారటం చూసిన లక్ష్మి కూడా దుఃఖం ఆపుకోలేక ప్రక్కగదిలో నిద్రపోతున్న చంటోడికి నిద్రాభంగం కలగకుండా మౌనంగా ఏడ్వసాగింది.

కాని రెండు నిముషాలలో తనని తాను సంభాళించుకొని ''అరెకరం పొలం అమ్మేద్దాం మావా?'' అంది.

''ఉన్న ఎకరం పొలంలో అరెకరం అమ్మేస్తే ఎలా బ్రతుకుతామే.''

''ముందు చంటోడి జబ్బు నయమవ్వడం ముఖ్యం. తర్వాత దేవుడు కరుణించివర్షాలు పడి పంటలు బాగా పండితే మళ్లీ కొనుక్కోవచ్చు. కాకపోతే కూలీ చేసుకొని బ్రతకొచ్చు. ప్రస్తుతానికి పొలం అమ్మడం కంటే వేరే మార్గం లేదు.''

ఒక నిముషంపాటు ఆలోచించి ''సరే. అలాగే చేద్దాం'' అన్నాడు స్థిరమైన మనస్సుతో.

పొలం అమ్మేయాలని నిర్ణయం తీసుకోవడంతో. డబ్బులు వస్తాయని. చంటోడిని కాపాడుకోగలమని నమ్మకం కలిగింది అతనికి. దానితో మనసులో వున్న ఆందోళన, భయం దూరమయ్యి ప్రశాంతత కలిగింది. ఆ ప్రశాంతత అతని ముఖంలో కూడా స్పష్టంగా కనిపించింది.

భర్త ముఖంలోని ఆ మార్పుని గమనించిన లక్ష్మి ''పద మావా అన్నం తిందూగాని..'' అంది.

''.....'' ఏమీ మాట్లాడలేదు రామయ్య.

భర్త ఏమీ మాట్లాడకపోవటంతో ''ఉదయం నువ్వు వెళ్లిన దగ్గర నుంచీ నేను కూడా ఏమీ తినలేదు.'' నెమ్మదిగా అంది.

ఆ మాటలు విన్న అతని కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. ప్రేమగా భార్య భుజం మీద చెయ్యి వేసి ''ఇద్దరికీ వడ్డించు కలిసి తిందాం.'' అన్నాడు.

భోజనాలు చేస్తుండగా.

''చంటోడికి వైద్యం చేయించలేమేమోనన్న బెంగతో నువ్వు, నేను తిండి మానేస్తే, నీరసాలొచ్చి మనం కూడా మూలన పడతాం. అప్పుడు చంటోడిని పెద్దాసుపత్రికి ఎలా తీసుకువెళ్తాం? వాడికి సేవలెలా చేస్తాం? అందుకని కడుపునిండా తిను మావా'' అంది లక్ష్మి.

''సరే.''

''ఇంతకీ పొలం ఎవరికి అమ్ముతావు?''

''మనం పొలంని ఆనుకొని భూషయ్యగారి పొలం వుందికదా. ఆయనకైతే మన పొలం కలుస్తుంది. కాబట్టి వెంటనే కొనుక్కుంటాడు. పైగా ఆయన పెద్ద భూస్వామి కదా. డబ్బు కూడా రెడీగా వుంటుంది. రేపు వుదయమే వెళ్లి మాట్లాడతాను.''

''సరే.''

ఇద్దరూ భోజనాలు ముగించి పడుకొన్నారు. నిద్రపోయారు.

***

రామయ్య మరుసటిరోజు ఉదయమే భూషయ్య ఇంటికి వెళ్లాడు.

''ఏంటి రామయ్య యిలా వచ్చావు?'' అడిగాడు

భూషయ్య.

"డబ్బులు అవసరమయ్యి అరెకరం పొలం అమ్ముదామనుకుంటున్నాను. నా పొలం మీ పొలం పక్కనే వుంది కాబట్టి, మీకైతే కలుస్తుందని మీ దగ్గర కొచ్చాను'' వినయంగా చేతులు కట్టుకొని చెప్పాడు.

"పొలం అమ్మాల్సినంత అవసరంఏమొచ్చింది?''

"మా బాబుకి కామెర్లు బాగా ముదిరిపోయింది. పెద్దాసుపత్రిలో వుంచి వైద్యం చేయించాలి. ఇరవై వేలు తెచ్చుకొమ్మని డాక్టరుగారు చెప్పారు. ఎంత ప్రయత్నించినా అప్పు ఎక్కడా దొరకలేదు. అందువలన పొలం అమ్ముదామని నిర్ణయించుకున్నాను.''

పొలం అమ్మడానికి కారణం తెలియగానే భూషయ్య మనసులో రామయ్య అవసరాన్ని అవకాశంగా తీసుకొని పొలంని తక్కువ రేటుకి కొనాలన్న దుర్బుద్ధి పుట్టింది. "ఈ రోజులలో పొలాల మీద రాబడి రాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు కదా! అందువలన నేను యింక మీదట పొలం కొనకూడదనుకున్నాను.'' అన్నాడు.

ఆ మాటలు వినగానే రామయ్యకి పొలం అమ్మలేకపోతానేమోననే భయం ఒక్కసారిగా ఆవహించి ఒళ్లంతా చమటలు పట్టాయి. "మీకైతే నా పొలం కలుస్తుంది. వందెకరాలున్న మీకు మరో అరెకరం సాగు చేయడం కష్టం కాదు.'' అన్నాడు.

"ఇంతకీ రేటెంత చెప్తున్నావు.''

తను రేటు చెప్తే అది ఎక్కువని పొలం కొనడం మానేస్తాడేమోనన్న భయంతో "మీకు తెలియనిదేముంది? ఎంతో కొంత మీరే నిర్ణయించండి.'' అన్నాడు వినయంగా.

"అమ్మేవాడివి నువ్వు కాబట్టి నీ అంచనా ప్రకారం రేటెంతో చెప్పు.''

ప్రస్తుతానికి అక్కడ పొలం రేటు ఎకరానికి ఒక లక్షా ఇరవైవేల వరకూ వుంది. కాని ఖచ్చితమైన రేటు చెప్తే, రేటెక్కువని భూషయ్య పొలం కొనడం మానేస్తాడేమోనని రామయ్య భయం. అందువలన భూషయ్య కొననంటాడేమోనన్న భయం మిళితమైన కంఠంతో "ప్రస్తుతం అక్కడ రేటు ఎకరానికి లక్షపైనే వుంది. నాకు ఎక్కువొద్దు. నా అరెకరానికి యాభైవేలు యిప్పించండి చాలు.'' అన్నాడు.

రామయ్యకి ఒంటినిండా చమటలు పట్టడం, అతని మాటలలోని భయం, దీనత్వం గమనించిన భూషయ్యకి యింకాస్త ప్రయత్నిస్తే పొలంని రామయ్య నుంచి బాగా తక్కువ రేటుకే కొనవచ్చనే నమ్మకం కలిగింది. దానితో "అది మూడేళ్ల క్రితం రేటు. ఈ మూడేళ్లుగా వర్షాలు లేక, పంటలు పండక రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం వలన పొలాలు ఎవ్వరూ కొనడం లేదు. దానితో పొలాల రేట్లు సగానికి సగం పడిపోయాయి.'' అన్నాడు.

ఆ మాటలు వినగానే రామయ్యకి గుండె ఆగినంత పనయ్యింది. మరింత చమటలు పట్టాయి. భూషయ్య తన అవసరాన్ని అవకాశంగా తీసుకొని పొలం తక్కువ రేటుకి కొనాలని చూస్తున్నాడని అర్థమవుతోంది. కాని తప్పనిసరిగా ఏదో ఒక రేటుకి పొలం అమ్మాల్సిన పరిస్థితి తనది. అంతేకాక భూషయ్యకైతే ఆ పొలం కలుస్తుంది. వేరేవాళ్లెవరూ తమ పొలాలకి దూరంగా అరెకరం పొలం కొనడానికి యిష్టపడకపోవచ్చు. అందువలన ఏదో ఒక రేటుకి భూషయ్యకే పొలం అమ్మాల్సిన పరిస్థితి తనది. ఆ దయనీయస్థితిలో భూషయ్య మాటలకి ఏమి సమాధానమివ్వాలో తెలియక మౌనంగా వుండిపోయాడు రామయ్య.

రేటు సగానికి సగం పడిపోయిందన్న విషయం నిజం కాదని తెలిసినా, దానిని ఖండించకుండా రామయ్య ఆలోచనలో పడటం గమనించిన భూషయ్యకి తన ఎత్తు పారిందన్న పూర్తినమ్మకం కలిగింది. దానితో తన ఆఖరి అస్త్రాన్ని ప్రయోగిస్తూ "ఇందాక చెప్పినట్లు నాకు పొలం కొనే వుద్దేశ్యం లేదు. ఈరోజే బంగారం కొనడానికి డబ్బులు తీసుకొని పట్నం వెళ్దామనుకున్నాను. కాని నువ్వేదో అవసరానికి అమ్ముకుంటున్నానేసరికి సరే అన్నాను. మనం ఈ విషయంలో ఈరోజే నిర్ణయానికి వస్తే బాగుంటుంది. లేదంటే నేను వెళ్లి బంగారమైనా కొంటాను. ఇంట్లో అంత క్యాష్ పెట్టుకోవడం మంచిది కాదు కదా.'' అన్నాడు.

**కనీసం యాభైవేలయినా చేసే తన అరెకరానికి పాతికవేలు మాత్రమే యిస్తాననేసరికి రామయ్యకి ఏమి సమాధానం చెప్పాలో పాలుపోలేదు. పొలం అంత తక్కువ రేటుకి అమ్మనని చెప్పి వెళ్లిపోదామని అనుకున్నాడు. కాని అలా అనుకున్న వెంటనే "నాన్న నన్ను బ్రతికించవా" అని చంటోడు అడిగినట్లనిపించింది.**

భూషయ్య అంచనా వేసినట్లే అతని ఆఖరి అస్త్రం రామయ్య అవసరం మీద అద్భుతంగా పనిచేసింది. ఏదో ఒక రేటుకి భూషయ్యకి పొలం వెంటనే అమ్మకపోతే తన కొడుకుని రక్షించుకోలేనని ఆలోచించి రామయ్య "మీరే ఏదో ఒక రేటు కట్టి తీసుకోండయ్యా. డబ్బులు మాత్రం వెంటనే యిప్పించండి. మా చంటోడికి వైద్యం చేయించాలి.'' నిస్సహాయంగా అన్నాడు.

"ఇప్పుడు ఎంతో కొంత యిమ్మని, ఆ తర్వాత అవసరానికి పొలం అమ్మితే భూషయ్య చాలా తక్కువ రేటు యిచ్చాడని నిందలు వెయ్యద్దు. నీ అరెకరానికి ప్రస్తుత పరిస్థితులలో నా అంచనా ప్రకారం ఇరవై వేలిస్తే సరిపోతుంది. కాని నువ్వేదో మీ బాబు వైద్యం కోసం అమ్ముతున్నానని అంటున్నావు కాబట్టి పాతిక వేలిస్తాను. ఇష్టమైతే అమ్ము, లేకపోతే లేదు'' అన్నాడు నిఖచ్చిగా.

కనీసం యాభైవేలయినా చేసే తన అరెకరానికి పాతికవేలు మాత్రమే యిస్తాననేసరికి రామయ్యకి ఏమి సమాధానం చెప్పాలో పాలుపోలేదు. పొలం అంత తక్కువ రేటుకి అమ్మనని చెప్పి వెళ్లిపోదామని అనుకున్నాడు. కాని అలా అనుకున్న వెంటనే "నాన్న నన్ను బ్రతికించవా'' అని చంటోడు అడిగినట్లనిపించింది. అంతే మరో ఆలోచన చెయ్యకుండా "పాతికవేలే యివ్వండి. నేను ఇంటికి వెళ్లి పొలం దస్తావేజులు తీసుకొస్తాను'' అన్నాడు.

"సరే'' అన్నాడు భూషయ్య.

ఇప్పుడు రామయ్య మనసులో యాభైవేలు ఖరీదు చేసే పాతికవేలకే అమ్మవలసి వచ్చిందన్న బాధలేదు. చంటోడిని బ్రతికించుకోగలనన్న ధైర్యం కలిగింది. పరుగు పరుగున ఇంటికెళ్లి పొలం దస్తావేజులు తీసుకొచ్చి భూషయ్యకిచ్చి "డబ్బులిప్పించండయ్యా. మా చంటోడిని ఆసుపత్రిలో చేర్పించాలి'' అన్నాడు.

"అదేంటి రామయ్యా. రిజిస్ట్రేషను అవ్వకుండా డబ్బులెలా యివ్వను. రేపు కొలతలు వేయిద్దాం. ఆ తర్వాత రిజిస్ట్రేషను సమయంలో నీకు పాతికవేలు యిస్తాను.''

"అయితే ఈరోజే కొలతలు వేయించి, ఈరోజే రిజిష్టరు చేయిద్దాం.''

"ఈ రోజు మంగళవారం కదా. పొలం కొనుక్కొంటూ మంగళవారం ఎవరైనా రిజిష్టరు చేయిస్తారా? రేపు కొలతలు వేయిద్దాం. ఎల్లుండి గురువారం రిజిష్టరు చేయిద్దాం. ఆరోజు రిజిష్టరు ఆఫీసులోనే నీకు పాతికవేలు పువ్వుల్లోపెట్టి యిస్తాను.'' అన్నాడు రామయ్యకి మరోమాట మాట్లాడే అవకాశం యివ్వకుండా.

చేసేదేమీ లేక "సరే" అని చెప్పి రామయ్య తన యింటికి వెళ్లాడు. కాని గురువారంనాడు పాతికవేలు చేతికొస్తాయి. ఆ డబ్బుతో చంటోడిని బ్రతికించుకోగలుగుతానన్న నమ్మకంతో వున్నాడు. గురువారం తొందరగా రావాలని దేవుడిని కోరుకున్నాడు.

***

కాలానికి ఎవరిమీదా మమతానురాగాలు కాని, రాగద్వేషాలుకాని వుండవు. అందుకే రామయ్య గురువారం ఎంత తొందరగా రావాలని కోరుకున్నా ఆ గురువారం బుధవారం తర్వాతే వచ్చింది. ఈ లోపులో చంటోడి ఆరోగ్యం బాగా క్షీణించింది.

"చంటోడు మనకి దక్కుతాడంటావా మావా?'' ఏడుస్తూ అడిగింది లక్ష్మి. లక్ష్మి కళ్లు తుడుస్తూ "చంటోడిని తీసుకొని మనిద్దరం రిజిష్టరు ఆఫీసుకి వెళ్దాం. అక్కడ పని అవ్వగానే భూషయ్యగారి దగ్గర నుంచి డబ్బులు తీసుకొని అటునుంచి అటే చంటోడిని పెద్దాసుపత్రికి తీసుకెళ్దాం.'' అనునయంగా చెప్పాడు రామయ్య.

అలాగే చంటోడిని తీసుకొని వాళ్లిద్దరు రిజిస్ట్రేషన్ ఆఫీసుకి వెళ్లారు. రామయ్య, భూషయ్యతోపాటు ఆఫీసులోకి వెళ్లాడు. లక్ష్మి చంటోడిని ఎత్తుకొని ఆఫీసు బయట ఒక చెట్టునీడలో నిలబడి రామయ్య ఎంత తొందరగా డబ్బులు తీసుకొని వస్తాడా అని ఎదురుచూస్తూ వుంది.

అరగంట తర్వాత రామయ్య పాతికవేలు చేతిలో పట్టుకొని ఆనందంగా బయటకి వచ్చాడు.

డబ్బులు లక్ష్మి చేతిలోపెట్టి "పద తొందరగా పెద్దాసుపత్రికి వెళ్దాం'' అంటూ లక్ష్మి భుజం మీద వున్న చంటోడిని తన భుజం మీదికి మార్చుకోడానికి ప్రయత్నించాడు.

కాని చంటోడిలో చలనం లేదు.

రామయ్యకి భయంతో చమటలు పట్టాయి.

చంటోడిని అక్కడ వున్న బల్లమీద పడుకోబెట్టి ముక్కుదగ్గర వేలు పెట్టి చూసాడు. శ్వాస ఆడడం లేదని గమనించాడు.

చంటోడి ఛాతీ మీద తన చెవిపెట్టి, గుండె కొట్టుకుంటున్నది లేనిది వినడానికి ప్రయత్నించాడు.

ఎంత ప్రయత్నించినా చంటోడి గుండె చప్పుడు వినపడలేదు.

కాని "నాన్నా నన్ను బ్రతికించలేవా?'' అని చంటోడు అడుగుతున్నట్లు వినిపించింది రామయ్యకి.

★